క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎల్కతుర్తి : మండల కేంద్రంలో 11కేవీ లైన్ మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా ఆదివారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సుధాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక



ఐనవోలు : సీఎం కప్–2024 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడలకు మండలంలోని ఒంటి మామిడిపల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రాజారపు వర్ష ఎంపికైనట్లు హెచ్ఎం మంద సదానందం తెలిపారు. ఈనెల 28,29,30,31వ తేదీల్లో మెదక్ జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొనున్నట్లు తెలిపారు. కాగా శనివారం క్రీడాకారిణి వర్షను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

పరమేశ్వర్ సేవలు అభినందనీయం



ఐనవోలు : ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని ఇన్‌చార్జ్ హెచ్ఎం అన్నారెడ్డి అన్నారు. మండలంలోని పున్నేలు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్ఎం రాయరాకుల పరమేశ్వర్ ఈనెల 31వ తేదీన ఉద్యోగ విరమణ పొందనున్నారు. కాగా శనివారం ఇన్‌చార్జ్ హెచ్ఎం అన్నారెడ్డి ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపిక అందించారు. అనంతరం ఆయన విద్యార్థులకు వాటర్ బాటిల్స్ అందించారు. ఏఏపీసీ అధ్యక్షురాలు రమాదేవి, కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మణ్, ఉపాధ్యాయులు ఇందిరా, రాహుల్‌కుమార్, వెంకటయ్య, స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, సుభద్ర, విమల, పేరెంట్స్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు బాసాని కైలాసం, కొప్పుల గ్రామానికి చెందిన అడిదెల సమ్మిరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. కాగా శనివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందుపట్ల సత్యపాల్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు మొగిలి, రామకృష్ణ, రాజు, నాగరాజు, చంద్రమౌళి, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరులో..



ఆత్మకూరు : మండలంలోని హౌజుబుజుర్గులో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన హుస్సేన్‌బీ కుటుంబాన్ని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రేవూరి రణధీర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఆమె కుమారుడు మాజీ సర్పంచ్ ఇమామ్‌ను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. కార్యకర్తల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. మాజీ ఎంపీపీ మార్క సుమలతరజనీకర్, మిరియాల కుమార్, శ్రవణ్, కమలాకర్, కుమార్ పాల్గొన్నారు.

నల్లా పైపు పగిలి నీటి వృథా

నర్సంపేట : పట్టణంలోని జయలక్ష్మి సెంటర్‌లోని లీల ఆస్పత్రి పక్కన మెయిన్ రోడ్డుపై పైపు పగిలి మూడ్రోజులుగా నీరు వృథా పోతోంది. దీంతో రోడ్డు బురదమయమై ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ తనిఖీ

వర్ధన్నపేట : పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఏసీపీ అంబటి నర్సయ్య శనివారం సందర్శించి తనిఖీ చేశారు. రికార్డులను, సిబ్బంది కిట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. బాధితుల నుంచి అందే ఫిర్యాదులను సమగ్రంగా విచారించాలని చెప్పారు. వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

రాయపర్తి : దరియాతండాకు చెందిన తేజావత్ అనితకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకుడు తేజావత్ సంతోష్‌నాయక్ శనివారం అందజేశారు. అనిత అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం పొందగా సీఎం సహాయ నిధి నుంచి సాయం మంజూరైందని చెప్పారు.

ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి



ఆయిల్‌పామ్ చెట్లను పరిశీలిస్తున్న అధికారులు



ఆయిల్‌పామ్ తోటలో అంతర్ పంటగా మొక్కజొన్న సాగు చేసిన రైతులు

- 247 ఎకరాల్లో సాగు
- డీడీలు చెల్లించిన మరికొంత మంది రైతులు
- సబ్సిడీ అందిస్తున్న ప్రభుత్వం
- తక్కువ పెట్టుబడి, అధిక ఆదాయం ఉండడంతో ముందుకొస్తున్న రైతులు

వేలేరు : ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తూ సబ్సిడీపై మొక్కలు అందజేస్తుండటంతో రైతులు ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. అలాగే ఆయిల్‌పామ్ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో సాగుకు మండలంలోని రైతులు ముందుకొస్తున్నారు. మండలంలో కేవలం నాలుగైదు గ్రామాల్లో సమృద్ధిగా నీరు ఉండగా.. మిగతా గ్రామాల రైతులు వర్షాధారం, వ్యవసాయ బావులు, బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. తక్కువ పెట్టుబడి, తక్కువ పనిభారంతోపాటు అంతర్ పంటలను సాగుచేసుకునే అవకాశం ఉందని హార్టికల్చర్ (ఉద్యానవన శాఖ) అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తుండడంతో మండలంలో 69 మంది రైతులు 247 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. మరికొంత మంది ప్రభుత్వానికి డీడీలు చెల్లించి సాగుకు సిద్ధం అవుతున్నారు. అధికారులు కూడా ఆయిల్ పామ్ సాగుతో వచ్చే లాభాలు, ఇతర సౌకర్యాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఎకరాకు రూ.4,200 సబ్సిడీ

ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సహకాలు, రాయితీలు అందిస్తోంది. ఐదెకరాల నుంచి పన్నెండున్నర ఎకరాల వరకు సాగు చేసే సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై డ్రిప్ పైపులు అందిస్తుంది. అలాగే ఆయిల్ పామ్ సాగుచేసే రైతులకు ఉచితంగా మొక్కల పంపిణీ చేస్తుంది. పంట దిగుబడి ప్రారంభమయ్యే వరకు అంతర పంటల సాగుకు ఏడాదికి ఏకరానికి రూ.42,00 చొప్పున సబ్సిడీ నాలుగు సంవత్సరాల వరకు అందజేస్తుంది. అలాగే ఉపాధిహామీ పథకం నుంచి ప్రతీనెల రూ.2100 మొక్కల నిర్వహణ కోసం సదరు రైతుకు అందజేస్తుంది. ఆయిల్ పామ్ పంట సాగు చేసిన తర్వాత నాలుగు నుంచి ఐదేళ్లకు దిగుబడి ప్రారంభమై సుమారు 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుందని అధికారులు తెలిపారు. దీంతో మండలంలోని రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ముందుకొస్తున్నారు.

తక్కువ పెట్టుబడి, అధిక లాభం



నేను రెండు సంవత్సరాల కిత్రం నుంచి పన్నెండు ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తున్నాను. ఆయిల్ పామ్ సాగుకు పెట్టుబడి, పనిభారం తక్కువగా ఉంది. దిగుబడి మొదలైన తర్వాత అధిక లాభాలు పొందే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. పన్నెండు ఎకరాల్లో అంతర్ పంటలుగా మొక్కజొన్న, దోస, ఇతర పంటలను సాగుచేస్తుండటంతో అధనపు ఆదాయం వస్తుంది. మండలంలోని మరికొంత మంది రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలి. ప్రభుత్వం అంతర్ పంటల పోత్సాహక డబ్బులు సమయానికి అందించాలి.

– శ్రీకాంత్, మల్లికుదుర్ల, ఆయిల్‌పామ్ రైతు

ఆయిల్‌పామ్ సాగు మేలు



వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ పంటను సాగు చేయాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఆయిల్ పామ్ పంట సాగు చేయడం వలన రైతులకు పెట్టుబడి, కూలీల కొరత పెద్దగా ఉండదు. అలాగే ఖర్చులు తక్కువగా ఉంటాయి. ఆయిల్ పామ్ సాగులో అంతర్ పంటలుగా పత్తి, మొక్కజొన్న, వేరుశనగా, పెసర, కూరగాయల పంటలను సాగుచేస్తూ అధనపు ఆదాయం పొందవచ్చు. ప్రభుత్వం కూడా ఆయిల్‌పామ్ పంటకు సబ్సిడీ ద్వారా, మొక్కలు, డ్రిప్ పైపులు అందిస్తుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– బి. సుస్మిత, హనుమకొండ డివిజన్ హార్టికల్చర్ అధికారి

మాటలు నమ్మి ఇళ్లు కూల్చుకున్నాం

- న్యాయం చేయాలని బాధితుల మొర
- ఎంపీడీఓకు దరఖాస్తుల అందజేత



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

శాయంపేట : 'రోడ్డు విస్తరణకు మీ ఇళ్లు అడ్డు వస్తున్నాయి.. వాటిని కూలుస్తాం.. ఇళ్లు కోల్పోయిన వారందరికీ డబుల్ బెడ్రూం ఇస్తామని గత పాలకులు ఇచ్చిన హామీని నమ్మి స్వచ్ఛందంగా ఇళ్లు కూల్చుకుని రోడ్డు విస్తరణకు సహకరించాం. కానీ ఇప్పటి వరకు ఇళ్లు కేటాయించకపోవడంతో రోడ్డున పడ్డాం. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికైనా సర్వేతో సంబంధం లేకుండా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించి న్యాయం చేయాలి' అని రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎంపీడీఓ ఫణిచంద్రకు 25 మంది మహిళలు వేర్వేరుగా దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు బాసాని కవిత, సామల రమాదేవి, వలపదాసు అనూష, జ్యోతి, అనసూయ మాట్లాడుతూ.. శాయంపేట నుంచి ఆత్మకూరు వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టే క్రమంలో రోడ్డు పక్కనఉన్న ఇళ్లకు అధికారులు మార్కింగ్ చేసినట్లు తెలిపారు. దీంతో అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి స్వయంగా సందర్శించి రోడ్డు విస్తరణకు సహకరించాలని, ఇళ్లు కోల్పోయిన వారికి డబల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తామని, ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతో స్వచ్ఛందంగా తామే ఇళ్లు కూల్చి వేశామన్నారు. అయినప్పటికీ తమకు ఎలాంటి ప్రొసీడింగ్ కాపీలు అందజేయలేదని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజాపాలనలో కూడా దరఖాస్తు చేసుకున్నామని, ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి ఇందిరమ్మ ఇళ్ల సర్వేతో సంబంధం లేకుండా రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. మహిళలు సునీత, రాజేశ్వరి, సరోజన, సబిత, కుమారస్వామి, వెంకటపతి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు పత్రాలు కలిగి ఉండాలి

- ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ



ట్రాక్టర్లకు నంబర్లు వేయిస్తున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ

కమలాపూర్ : వాహనదారులు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ జంక్షన్‌లో శనివారం వాహన తనిఖీలు చేపట్టి పత్రాలు పరిశీలించారు. సరైన పత్రాలు లేని, ఇన్సూరెన్స్ లేని పలు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి జరిమానా విధించారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలకు నంబర్లు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలో చాలా వాహనాలకు ఇన్సూరెన్స్ ఉండటం లేదని, పలువురు నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వాహన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నందున కేజీవీల్స్‌తో ట్రాక్టర్లను రోడ్లపై నడుపొద్దని, పొలాల వద్దనే ట్రాక్టర్లకు కేజ్ వీల్స్ అమర్చుకోవాలని ట్రాక్టర్ డ్రైవర్లు, రైతులకు సూచించారు. సిబ్బంది వెంకటరమణ, భాస్కర్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక



మాట్లాడుతున్న డీఆర్డీఓ మేన శ్రీను

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం జరిగింది. డీఆర్డీఓ పీడీ మేన శ్రీను హాజరై మాట్లాడారు. 2023–24 సంబంధించిన ఉపాధిహామీ పనుల్లో చిన్నచిన్న పొరపాట్లు తప్పితే పెద్దగా పొరపాట్లు జగలేదన్నారు. మరోసారి ఎలాంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఏపీడీ శ్రీనివాస్‌రావు, డీవీఓ నర్సింహారెడ్డి, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్, ఈసీ శ్రీధర్, ఏపీఓ అనిత, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మతల్లి బోనాల పండుగ

గీసుకొండ : మండలంలోని శాయంపేట హవేలీలో శనివారం రాత్రి పెద్దమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ముదిరాజ్, యాదవ కులాల ప్రజలు బోనాలతో తరలివెళ్లి ఆలయం వద్ద మొక్కులు చెల్లించారు. నూతన ఆలయాన్ని తన డబ్బుతో నిర్మించిన బొమ్మెర మనోహర్‌ను స్థానిక ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జూల రమేశ్, నీరటి కుమారస్వామి, మాజీ ఎంపీపీ ముంత కళావతి, తదితరులు పాల్గొన్నారు

నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం



అభిషేకంలో పాల్గొన్న ఈఓ నాగేశ్వర్‌రావు, అర్చకులు

ఐనవోలు : మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో బహుళ త్రయోదశిని పురస్కరించుకుని 5వ సారి శనివారం ప్రదోష వేల నందీశ్వరుడికి అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో రుద్రుడికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంకాలం సూర్యాస్తమయం తర్వాత ప్రదోషకాలంలో మల్లికార్జున స్వామి గర్భాలయానికి ఎదురుగా ప్రతిష్ఠితమైన నందీశ్వరుడిని పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో అభిషేకించారు. నందీశ్వరుడికి వస్త్రధారణ చేసి, ధూపం వేసి గంధం బొట్టుపెట్టి అలంకరించారు. వేదోక్తంగా పూజించి పండ్లు ఫలాలతో నైవేద్యం సమర్పించారు. అనంతరం నందీశ్వరుడికి, గర్భాలయంలో రుద్రుడికి నక్షత్ర హారతిని కనులపండువగా జరిపించారు. ఆర్జిత సేవా టికెట్ భక్తులకు స్వామి వారి శేష వస్త్రాలతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ముఖ్య అర్చకుడు మధుకర్ శర్మ, వేదపండితులు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్‌జోషి, అర్చకుడు భానుప్రసాద్‌శర్మ, సాయిరామ్ శర్మ, పాతర్లపాటి నరేష్‌శర్మ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



శాయంపేట : పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వాములు



ఆత్మకూరు : నగరసంకీర్తనలో భక్తులు



కమలాపూర్‌లో..

శాయంపేట : మండల కేంద్రంలో శనివారం అయ్యప్ప మహా పడిపూజ లోకలబోయిన కుమారస్వామి గృహంలో వరంగల్ హరిహర క్షేత్ర ప్రధాన అర్చకుడు అనంతపద్మనాభ స్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పూలతో అలంకరించిన మండపంలో గణపతి–లక్ష్మీదేవి అయ్యప్ప పటాలను అలంకరించి స్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు. వరంగల్ ఆర్కెస్ట్రా వారు పాడిన వివిధ భజన పాటలతో, అయ్యప్ప శరణుఘోషతో గ్రామమంతా మార్మోగింది. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మత్స్యగిరి స్వామి దేవాలయ చైర్మన్ గురుస్వామి, సామల భిక్షపతి, జిన్నా శ్రీనివాస్‌రెడ్డి, వినుకొండ రాజ్‌కుమార్, దిడ్డి రమేష్, గట్టు కిషన్, మార్త సుమన్, బొల్లపెల్లి సదానందం, గోరంటల ప్రశాంత్, మాజీ సర్పంచ్ కందగట్ల రవి, మాజీ ఎంపీటీసీ వినుకొండ శంకరాచారి, తిప్పారపు ప్రభాకర్, వనం విశాల్, బూర శివకృష్ణ, కోమటి రవికమల్, మాధవ, చంటి, భక్తులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండలంలోని పంగిడిపల్లిలో స్వయంభూ మణీశ్వర అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి అయ్యప్పస్వామి మండలపూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి ఇందుర్తి జానకి రామారావు ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మండల, దివ్య పడిపూజా మహోత్సవం జరిగింది. అయ్యప్పకు అన్ని రకాల అభిషేకాలు నిర్వహించిన అనంతరం పడి ముట్టించి అయ్యప్ప మాలాధారులతో పాటు భక్తులు తన్మయత్వంతో పులకించిపోయారు. అయ్యప్పస్వామి భజన సంకీర్తనలతో గ్రామం మార్మోగింది. మోకిడె రాజేశ్వర్‌రావు కుటుంబ సభ్యులు, ఆలయ శాశ్వత దాత, హైదరాబాద్ వాస్తవ్యుడు గుత్తా ప్రభాకర్ రావు దంపతులు, ఆలయ అర్చకుడు సురేందర్ రావు, గ్రామ, మండల అయ్యప్ప స్వాములు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు, మండల ప్రజలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో నగరసంకీర్తన

ఆత్మకూరు : మండల కేంద్రంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని శనివారం శ్రీనివాసశరణాగతి దీక్షాదారులు, భజనమండలి, వికాసతరంగిణి సభ్యులు వైభవంగా నగరసంకీర్తన చేశారు. గోవిందనామాలు పాడుతూ భజన కీర్తనలు ఆలపిస్తూ గ్రామంలోని వీధుల్లో సంకీర్తన చేశారు. ఈ కార్యక్రమంలో టింగిలికారి సత్యనారాయణ, పరికిరాల వాసు, నాగబండి శివప్రసాద్, మునుకుంట్ల సతీష్, తనుగుల సందీప్, రాసమల్ల రామకృష్ణ, రవి, వేణు, ప్రభాకర్, సంతోష్ పాల్గొన్నారు.

బాలబాలికలను సమానంగా చూడాలి

- సఖి లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, భారతి



మాట్లాడుతున్న సఖి లీగల్ కౌన్సిలర్

కమలాపూర్ : బాలబాలికలను సమానంగా చూసి లింగ వివక్షను రూపుమాపాలని సఖి లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, భారతి సూచించారు. మండలంలోని గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలకు విద్యతో పాటు క్రమశిక్షణ అవసరమన్నారు. సఖి వన్‌స్టాప్ సెంటర్ అందించే సేవలు, చైల్డ్ రైట్స్ గురించి వివరించారు. అనంతరం ×ఆడపిల్లల భవిష్యత్‌కు ఇబ్బంది కలిగించే పరిస్థితులు ఏమిటి?' అనే అంశంపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ సంస్థ సీసీ భోగి శ్రీలత, ఇన్‌చార్జ్ హెచ్ఎం అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు జయ, సంధ్యారాణి, లలిత, శ్రీరామచంద్ర, సిద్దార్థ, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యవంతమైన సమాజం

- ఆయుష్మాన్ భారత్ యోగా గురువు రఘుపతి



మాట్లాడుతున్న రఘుపతి

పరకాల : యోగాతో మానసిక ఒత్తిడి దూరమవడంతో పాటు ఆరోగ్యవంతమైన శరీరం సాధ్యపడుతుందని ఆయుష్మాన్ భారత్ యోగా గురువు రఘుపతి అన్నారు. ప్రతిఒక్కరూ యోగా చేయాలని, విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని సూచించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు యోగాపై శనివారం అవగాహన కల్పించారు. ఉదయం యోగా చేసేందుకు విద్యార్థులు ఆసక్తి చూపించాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. ప్రతిఒక్కరూ యోగాపై మక్కువ పెంచుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు కొవ్వొత్తులతో నివాళి



మన్మోహన్‌సింగ్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

కమలాపూర్ : ఆర్థిక సంస్కరణ ఆద్యుడు, భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూడ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు చేరాల రోహిత్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి స్థానిక బస్టాండ్ కూడలిలో మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పించి మౌనం పాటించారు. నాయకులు మాట్లాడుతూ.. మన్మోహన్‌సింగ్ మృతి కాంగ్రెస్ పార్టీతో పాటు దేశానికి తీరని లోటన్నారు. యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మనీష్, హుజూరాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు చరణ్‌పటేల్, సుభాష్, కృష్ణ, శోభన్, రాజిరెడ్డి, శ్రీకాంత్, పర్శరాములు, చంద్రశేఖర్, వెంకటేష్, కుక్కల కుమార్, ఎంబాడి తేజ, ఎండీ.ఆసిఫ్, నవీన్, అనిల్, ప్రశాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

ఆత్మకూరు : మండల కేంద్రంలో కాంగ్రెస్ 140వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్లు పరికిరాల వాసు, బరుపట్ల కిరీటి, సొసైటీ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు తనుగుల సందీప్, రేవూరి జయపాల్‌రెడ్డి, కాడబోయిన రమేశ్, బూర రమేశ్, అలువాల రవి పాల్గొన్నారు.

సర్వే అధికారిపై పెంపుడుకుక్క దాడికి యత్నం

పరకాల : ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు వెళ్లిన ఓ వార్డు అధికారిపై పెంపుడుకుక్క దాడికి యత్నించింది. దీంతో అతడు రోడ్డుపైకి పరుగులు తీశాడు. ఈ సంఘటన పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. వార్డు అధికారి శ్రీనివాసరావు తనకు కేటాయించిన 13వ వార్డులోని ఓ ఇంటి వద్దకు వెళ్లి ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటిలోని పెంపుడుకుక్క గొలుసు తెంపుకొని ఒక్కసారిగా దాడికి యత్నించింది. దీంతో ఆయన రోడ్డుపైకి పరుగులు తీశారు. ఇంటి యజమానురాలు కుక్కను అడ్డుకోవడంతో కుక్క దాడి నుంచి తప్పించుకున్నట్లయిందని సదరు అధికారులు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం ఇళ్లలోకి వెళ్లాలంటే వార్డు అధికారులు భయపడాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు.

ఎస్సైకి సన్మానం

శాయంపేట : ఎస్సై జక్కుల పరమేశ్‌ను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పు రాజు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కానుగుల నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ, రాకేష్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై పలురు సూచనలు చేశారు.

యువకుడికి గాయాలు

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఇల్లంద శివారులో శనివారం చోటు చేసుకుంది. నల్లబెల్లికి చెందిన ముత్యం అనిల్ బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన ఆయన్ను స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

మన్మోహన్‌సింగ్ సేవలు మరువలేనివి

పర్వతగిరి : దేశ ప్రధానిగా మన్మోహన్‌సింగ్ అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు అన్నారు. మండల కేంద్రంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.